# 13

## సాధుపారం

రైలు స్టేషన్‌లో సిద్ధంగాఉంది. దూరంనుంచి ఎప్పుడు కదులు తుందో అన్న ఆందోళన కలగజేస్తున్నది.

స్టేషను సమీపిస్తున్నకొద్దీ రమణమనస్సులో ఆశ, ఆందోళన, తొందరపాటుతనం పెనవైచుకొని పోతున్నాయి. చిన్న సంచీ చేత పట్టుకొని త్వరత్వరగా నడుస్తున్నాడు. రోడ్డుమీది లెవెల్‌క్రాసింగ్ దాటి స్టేషన్ ఆవరణలోని వేపచెట్లను సమీపించేటప్పటికి గంట కొట్టటం వినిపించింది. రమణ మనస్సులో ఎంతో దుఃఖం కలిగింది. రైలు కదిలిపోతున్నట్లే బాధపడ్డాడు. దేవుళ్ళందరికీ మొక్కు-కున్నాడు. బుకింగ్ కౌంటర్‌వద్ద మనుష్యలు క్యూలో నిలుచుని టిక్కెట్లు తీసుకుంటున్నారు. నలుగురైదుగురున్నారు. వాళ్ళవెనక నిలుచోటానికి దుఃఖం కలిగింది రమణకు. ఒక్కొక్కరు కదిలి పోవటానికి గంట ఆలస్యం జరుగుతున్నట్లున్నది ప్రాణానికి. ఎవరో బుకింగ్ క్లర్క్‌ను ప్రాధేయపడుతున్నారు—"రైలు కదిలిపోతుం దేమో, టికెట్టివ్వమని". అవతల ఆ క్లర్క్ విసుక్కుంటున్నాడు. చిల్లరలేదని సతాయిస్తున్నాడు. రమణకు ఏడుపువచ్చినంతపనైంది. మనుషులందరి యెడలా అసహనము, అసహ్యము ముంచుకొని వచ్చాయి. ఇంతకీ ఇంకో గంటకూడా వినపడింది. బుకింగ్‌క్లర్క్ కనపడుతున్న విండోలోంచి గార్డుకాబోలు టోపీ పెట్టుకుని జెండాలు పట్టుకొని వెళుతున్నాడు. రమణ తాను రైలందక ఇంటికి తిరిగి వెళుతున్నట్లే బాధపడ్డాడు. ఇంట్లో రైలందలేదని చెప్పినప్పుడు తల్లి

ముఖం చిన్నపుచ్చుకున్నట్లు వూహించుకుంటున్నాడు. చెమటలుపట్టి పోతున్నాయి. తన అదృష్టం ఎప్పుడూ ఎందుకిలాగు ఉంటుంది? తానెప్పుడు ప్రయాణంచేస్తున్నా ఈ చికాకు ఎప్పుడూ తప్పటంలేదు. ప్రతిసారీ జాగ్రత్తపడదామనుకుంటాడు.

ఒక్కొక్కసారి మూడుగంటలు లేటవుతుంది తాను వచ్చినప్పుడు. ఒక్కొక్కసారి ముందే వెళ్ళిపోతుంది. ఇంకోసారి పైన బెర్తుని పట్టుకొని వేళ్ళాడవలసివస్తుంది. తన ఖర్మఏమో ఇది!

తనముందు ముగ్గురూ కదిలిపోయారు. రమణ ఆత్రంగా టికెట్ తీసుకున్నాడు. టికెట్‌కలెక్టరు తనకు రైలు అందకుండా చేయాలని వంచన చేస్తున్నట్లుగా అనిపించింది కాసేపటిలోనే. ఎవరికీ తనమీద లక్ష్యంలేదు. తనని హీనపరచి బాధపెట్టటానికి చూసేవాళ్ళే అందరూ. వీళ్ళందరికీ పొగరు, అహంభావం, అతిశయం. ఏం వీళ్ళంత తాను చదువుకోలేదా? తనకుమాత్రం ఉద్యోగంలేదా? అయితే మరి వీళ్ళందరూ దర్పంగా చొక్కాకాలర్లు పైకితీసుకొని ఎవరన్నా లక్ష్యంలేనట్లు బ్రతుకుతుంటారు. తన కెందుకింత భయం? తానెందుకింత వొదిగివొదిగి ఉంటాడు?

టికెట్ తీసుకుని పరిగెత్తుతూ ఎదురుగాఉన్న పెట్టెలోకి ఎక్కాడు. ఎవరో రైతు తనని ఆపి ఏమిటయ్యా ఆ ఆత్రం అని నవ్వు మొహంతో చేతికి చుట్ట తీసుకొని పక్కనున్న తలుపుకి కొట్టి కొడిరాల్చుతూ అడుగుతున్నాడు. వీడు తనకు మర్యాదా, సరియైన ప్రవర్తనా నేర్పబోతున్నాడు. రైలుపెట్టెలో ఉమ్మివేయకూడదని కూడా తెలీనివాడు. దొంగలంతా పెద్దమనుషులైనారు. మూర్ఖులంతా జయించుకొనిపోతున్నారు. రమణ తల కుంగిపోయింది. "ఏమిటయ్యోయ్, ఇపింట మనుషులుకూడా కనపడటం లేదే. నీ తొందరే నీదిగాని." రమణ అనునయంగా "చూడలేదు. రైలు కదిలిపోతుందేమోనని తొందరపడ్డాను." అని చెప్పాడు. ప్లాట్‌ఫారంమీదికి తుపుక్కున ఉమ్మివేసి "ఇదెక్కడ కదిలిచస్తది. ఇంకా గంటకు కదిలినానయమే!" అన్నాడతడు. తననుచూపి అందరూ పకపక

నవ్వుతున్నట్లనిపించింది. హృదయంలో దైన్యమంతా సుడులు సుడులుగా తిరిగి తనను నిలవనీయటంలేదు. తననుచూసి అతదేమను కుంటున్నాడో!రమణ కా పెట్టె దిగి ఇంకోపెట్టెలోకి వెళ్ళి కూచుందా మనిపించింది. మనస్సు బలంగా దిగిపొమ్మంటున్నది. కాళ్ళూ చేతులూ మొండికేస్తున్నాయి. కొంచెంసేపటి తరువాత దిగుదామని శరీరం ముందుకు కదలగా మనస్సు నీరుకారిపోయింది. ఇప్పుడు దిగిపోతే ఎదుటి సీటుమీద ఉన్న పెరుగుతట్టల ఆడమనిషి, ఈ వేపున కూచున్న బట్టలకొట్టు వ్యాపారస్థుడు, ఆ మూలకూచున్న కిళ్లీకొట్టు పెద్దమనిషి తలుపుదగ్గర నిలుచున్న యీ రైతు, ఆ గ్లాస్కో పంచె కట్టుకుని కళ్ళకు కూలింగ్‌గ్లాసెస్‌తో చార్‌మినార్ సిగరెట్టు తాగుతూ ఘోర్తుఫారం మూడుసార్లుతప్పి పంచాయతీబోర్డు మెంబరుగా ఉంటున్న ఆ పెద్దమనిషి వీళ్ళంతా తా నీ పెట్టె దిగీ దిగగానే వీపు మీద పకపక నవ్వుతారు కాబోలు. ఈ రైలు ఇక్కడనుండే బయలు దేరుతుంది కాబట్టే తనకు వీళ్ళంతా కొంతలో కొంత తెలుసు. అప్పుడప్పుడు వీధిలో తారసపడే ముఖాలు ఇవన్నీ. వీళ్ళంతా తననే చూస్తున్నారు. తరువాత తననిగురించే చెప్పుకుంటారు. మధ్యమధ్యన వెధవ తెలివితేటలు చూపించుకుంటూ తలావొకమాట అనుకుంటూ నవ్వుకుంటారు. ఈ కాలంలో చదువుకున్నవాళ్ళకన్నా మనకే లోకజ్ఞానం ఎక్కువ అని సిద్ధాంతీకరిస్తారు. అవును, తననెంత మంది ఆ మాట అనలేదు? ఎంతమంది ముందు తాను అవమానం పొందలేదు? ఎక్కడనుంచో మిడతవచ్చి తమమీద వాలితే దాన్నితీసి అవతల పారవేసినట్లు ఎంతమంది తనను విదిలించలేదు? తృణీకరించ లేదు? నవ్వలేదు?

ఈ రైలు ఇంకా కదలలేదు. మనస్సులో ఇదికూడా ఒకపెద్ద దుఃఖకారణమే అయింది రమణకు. తాను ఎక్కిన వెంటనే కదలి ఉంటే తానిందరిముందు పరిహాసపాత్రుడు కావలసివచ్చేది కాదు. ఇలానే ఎవరైనా తలగుడ్డచుట్టుకుని నోట్లో చుట్టపెట్టుకుని వొకపక్క చొంగకారుతూ పంచె ఎగదోపుకుంటూ వొకచేతికి తట్టా, మరొక చేతికి బుట్టా పట్టుకుని ఎవరైనావచ్చిపడినా వీళ్ళకు విడ్డూరమనిపించదు.

నవ్వులాటగా ఉండదు. తననిచూసి సర్కస్‌లో ఏదో ఫీట్‌చూసి వినోదపడుతున్నట్లుగా వీళ్ళంతా నవ్వుకుంటున్నారు.

ఇవాళ పొద్దునలేచి చక్కగా నున్నగా పాలరాయి తళుక్కు-మంటున్నట్లుగా గడ్డం గీచుకున్నాడు. కాఫీ తాగుతూ పెదవులమీద చిరునవ్వులు కురిపించాడు. 'ఇంతబాగా కాఫీ కలపగలవని అనుకోలేదమ్మా' అని అమ్మను పొగిడాడు. "నాదేముంది నాయనా, పెద్దదాన్నై పోయాను. రేపు నీ పెళ్ళాంవ స్తేగాని" అని అమ్మతియ్యగా మాట్లాడింది. అలా అనిపించుకుందామనే రమణ ఉబలాటం.

సబ్బంతా అరగదీసి స్నానం చేశాడు. తనకున్న మాంచి బట్టల జతను-పదిహేనురోజులనుంచీ అవసరంపడ్డా దాచిపెట్టుకున్నదాన్ని తీసి ధరించాడు. ఆఫీసర్‌గారింటికి వెళ్ళి దేవుడికి పెట్టేదానికన్నా భక్తిగా, వినయంగా, భయంగా దండంపెట్టి యీ శుక్రవారం ఒక్క-రోజు శెలవు యిప్పిస్తే రేపు సెకండ్‌శాటర్‌డే కాబట్టిన్నీ, ఆపైన ఆదివారమున్నూ కనుక సోమవారంనాడు తప్పక వొకగంట ముందే ఆఫీసుకు హాజరవుతానని మనవి చేసుకున్నాడు. ఆ ఆఫీసరుగారు చేదు చిరునవ్వు నవ్వి 'సరే' నంటే ఎంత మంచివాడని ఆయన్ని మనసులో మెచ్చుకుని వొక్క-అంగలో ఇంటికి వచ్చేశాడు. చిన్న హేండ్‌బాగ్‌కి వొక పంచె, ఇంకోజత బట్టలూ, బనీను, రెండు టవల్సు, మైసూర్ శాండల్ సోపు, బ్రహ్మాండగా సిగ్గుపడుతూ లవండర్‌సీసా భద్రపరిచాడు. ఇవాళ ఆకలికూడా కాదు. అమ్మకు చెప్పాడు. 'పన్నెండుగంటల బండికి గుంటూరు వెళుతున్నాను' అని. ఆమెకు చాలా సంతోషమైంది. పాత వారపత్రిక తీసుకుని పేజీలు తిరగేస్తుంటే గడియారం ముళ్ళు మారాం చేస్తున్నట్లుగా, చోద్యం చూస్తున్నట్లూ, సూర్యుడు వొకచోట నిలచినట్లూ, కాలం బొత్తిగా ముందుకు సాగనట్లుగానూ అనిపించింది. తాను వొంటరిగా కూచోలేననిపించింది. ఆ పత్రిక నక్కడే పడేసి వీధి వాకిలి దాటుతుంటే అమ్మ మాటలు వినిపించాయి. "నాయనా, త్వరగా వచ్చేసెయ్‌రా, పదకొండుకల్లా ఇంటికి రా. ఇప్పుడే వంట చేసేస్తున్నాను." రమణ

ఉల్లాసంగా వెళ్ళిపోయాడు. పక్కవీధిలోనే క్లర్కు వీరభద్రం వాళ్ళింటికెళ్ళి కాసేపు హస్కువేసి రావచ్చునని వెళ్ళాడు. వీరభద్రంవీధి వాకిట్లో తోటకూర బేరం చేస్తున్నాడు. అణాకు ఏడుకన్నా నువు చచ్చినా ఇవ్వనంటున్న దా అమ్మి. తల్లి-తల్లి-నీకు పుణ్యం వుంటుంది ఎనిమి దివ్వమంటున్నాడు వీరభద్రం. రమణకు అసహ్యమేసింది వీరభద్రాన్ని చూస్తే. వాళ్ళ పాపను భుజంమీద పడుకోబెట్టుకుని వాకిట్లో నిల్చుని బేరం చేస్తున్నాడు. ఆ పాప ముక్కు తుడుద్దామన్న శ్రద్ధ కూడా లేకపోయింది అతడికి. తోటకూరమ్మి కలెక్టరుకన్నా హోదాతో "ఏవిటయ్యా నీ బేరం" అని కసురుకుంటున్నది. ఏడుస్తూ ఏడు తీసుకుని ఆ అమ్మిని పంపించాడు వీరభద్రం.

"ఏం రమణా, ఏమిటి ఇవాళ వెళుతున్నావా?" అని అడిగాడు. రమణ తలవూపి ఆలోచించాడు. సినిమాలో లీలోద్యానంలో ప్రేమికుల జంట డ్యూయెట్ పాడి కౌగిలి సడల్చి ఎవరిదారిన వారు పోగా, ప్రక్కనే సెట్టింగ్ భేతాళమాంత్రికుడు రాజకుమారుణ్ణి బంధించి దేవికి బలి ఇవ్వబోతున్నట్లూ, అందమైన కల కాస్తా చెదరిపోయినట్లూ వీరభద్రం దరిద్రం, రమణమనస్సుని ఆక్రమించింది. రేపు తనూ, వల్లి కూడా ఇలానేనా సంసార యాత్రను సాగించటం! చీమిడిముక్కు పిల్లలు, చీడపట్టిన తోటకూర ఇంకొక్కకట్ట ఎక్కువవస్తే బావుండునన్నతాపత్రయం,మాసిపోయిన వాయిల్ చీరదండెంమీద కనులకు విందుచేయటం రమణ ఆలోచించలేకపోయాడు.

బంగారుబొమ్మ కింద పడిపోయి మట్టి అంటుకున్నట్లనిపించింది వల్లిని తలుచుకోగానే. కళ్ళు తడి ఆరిపోయినయ్. చక్రాల్లాంటి గుండ్రటి కళ్ళు, గులాబిమొగ్గ బుగ్గలు, చప్పట్లు చరుస్తూ కిల కిల నవ్వే ఉల్లాసం, రెండు చేతులతో క్రాపు చెరిపేసి, చిందరవందర చేసి వాళ్ళోఉన్న అద్దాన్ని లాక్కుని గదిలోకి తుర్రున పారిపోయే ఉత్సాహం, వేసవికాలపు తెల్లవారుఝామున నలిగిపోయిన మల్లెపూల వాసనలాగా ఉంటుంది వల్లినిగూర్చిన ఆలోచన తనకు. అటువంటి వల్లిని రెండుగదుల అద్దెఇంట్లో తనతో బ్రతుకును పంచుకోమనటం

ఎట్లా? రమణమనసులో చాలా అసంతృప్తి కలిగింది. వల్లి సంపెంగ పూవైతే తాను తొడిమకూడా కావటానికి అర్హుడుకాడు. అయినా ఎట్లా? వల్లి తనది కాకపోతే ఈ ఉద్యోగం ఎందుకు? ఈ బ్రతుకెందుకు? ఈ ప్రయాణా లెందుకు? కార్లూ, రైళ్ళూ తిరగకపోతే మాత్ర మేం? వెంటనే కామరూప కామగమనశక్తులుంటే గుంటూర్లో వెళ్ళి వాలేవాడే!

రమణ ఏవేవో ఆలోచనల్లో ఉండగానే వీరభద్రం కాఫీ తెచ్చి యిచ్చాడు. 'ఇప్పుడు కాఫీ ఎందుకోయ్!' అన్నాడు రమణ. "నేనింకా తాగలేదు లే, అందుకని తెచ్చాను" అన్నాడు వీరభద్రం కాలిపోతున్న ఇత్తడిగ్లాసు రమణ చేతి కందిస్తూ. రమణ అయిష్టంగానే తీసుకున్నాడు.

వర్షం కురుస్తుండగా పత్రికట్టె పందిరిమీదినుంచి పడుతున్న చూరునీళ్ళు వెచ్చబెట్టినట్లుగా ఉన్న దా కాఫీ. రుచీపచీలేదు, వేడితప్ప. పోనీ తీయని వేడినీళ్ళలాగాకూడా లేవు. పంచదార కావాలా అని మర్యాదకైనాఅడుగుతాడేమోనని ఎదురుచూశాడురమణ. ఆవేపునుంచి ఆ సూచనలేమీ కనిపించలేదు. అమ్మ చక్కెర అయిపోయిందంటే నిన్న బజారంతా తిరిగి వాక కిలో తాను సంపాదించుకొనిరావటం కళ్ళముందు కనిపించింది. చిన్నప్పుడు ఆస్పత్రికి వెళ్ళి చేసేదిలేక భయంతో కాంపౌండరు నోట్లో గుక్కగుక్కలా పోస్తుంటే మందు మింగినట్లు మింగాడు రమణ. గ్లాసు కిందపెట్టాడు. అక్కడ ఉండ బుద్ధిపుట్టలేదు. చంటిపిల్ల ఇంట్లోంచి ఏడుస్తున్నది. వీరభద్రం చొక్కాకు గుండీ కట్టుకుంటూ వచ్చాడు.

"ఏంలేదు. ఈపూట గుంటూరు వెడుతున్నాను. మళ్ళీ సోమవారం ఆఫీస్టైముకు వస్తాను, కాస్త నా టేబిల్మీద ఫైలు ఈపూట చూడు."

వీరభద్రం నవ్వాడు. "ఈసారన్నా కాస్త మీ మామయ్యను ఇంప్రెస్ చేసి రావోయ్. శ్రావణంలో నన్నా మా కింత పప్పూ, అన్నం పెట్టించు."

రమణ అయిష్టంగా నవ్వాడు. "మళ్ళీ సోమవారం కలుద్దాం" అంటూ బయటకు వచ్చేశాడు. ఎక్కడకు పోవాలో తోచలేదు. పది గంటలుకూడా కాలేదు. ఇంటికి పోవటానికి యిష్టం కలగలేదు. లైబ్రరీకి వెళ్ళాడు. ఎవరోపదిమంది అక్కడచేరి దినపత్రికలు చూస్తున్నారు. రమణ ఏదో పత్రిక చూస్తూ కూచున్నాడు. 'ప్రభుత్వోద్యోగులలో జాప్యం-మంత్రిగారి మందలింపు'. 'ఉపాధ్యాయులు అన్నం తినటంలేదా?! మహానాయకుని సూటిప్రశ్న!' 'విద్యార్థులలో క్రమశిక్షణారాహిత్యం—ప్రముఖ విద్యావేత్త సంతాపం'. 'లక్షమంది శరణార్థుల రాక'. 'రైలుప్రమాదం—పందొమ్మిదిమంది మృతి'. 'కరువుభత్యం ఐదురూపాయలు హెచ్చించాలి!' మనస్సంతా విసుగుతో నిండిపోయింది. కల్లరులూ, కపటులూ దేశోద్ధారకులైనారు. ఎక్కడచూసినా ధర్మప్రసంగాలు చేస్తున్నారు. అందరూ మానవ జీవితం రెండువందల సంవత్సరాల ప్రమాణానికి పెరిగిందనీ, కొందరుఆకల్పాంతస్థాయిలో బ్రతుకుదామనీ చస్తున్నారు పొగరుతో, కళ్ళకు కావరంతో.

చెలిమి మోసానికీ, కలిమి పాపానికీ, మునిసిపాలిటీ మురికికీ, అబద్ధం ప్రయోజకత్వానికీ ఆలంబనమైపోయాయి, అజ్జాడదాసుగారు తమస్వీయచరిత్రలో చెప్పినట్లు...

రమణ మనస్సు చిన్నపుచ్చుకుని ఇంటికి వచ్చాడు. అమ్మ పప్పుచారులో తిరగమాత పెడుతున్నది. రమణ మనస్సంతా రైల్వే స్టేషన్‌లోనేఉంది. తాను వెళ్ళేటప్పటికి వల్లి ఫాన్ పెట్టుకుని, వొక వైపు రేడియో ట్యూన్‌చేసి వారపత్రికేదో చదువుకుంటూ కూచుని ఉంటుంది. తనని చూడగానే వచ్చే సంతోషాన్ని పెదవులమీద బలవంతంగా ఆపుకుంటుంది. నవ్వుకీ, పెదవులకీ యుద్ధం జరుగుతుంది. దురాక్రమణదారుడిలా నవ్వే సరిహద్దులను దాటుతుంది. కళ్ళు పెద్దవైపోతవి. అవికూడా నవ్వుతవి. శరీరంలో తొట్రుపాటు వస్తుంది. కుర్చీలోంచి త్వరత్వరగా లేచేటప్పుడు చూడాలి వల్లి అందం. ఆ అడుగుల తడబాటు, కూజాలోంచి చల్లని మంచినీళ్ళు తెచ్చి దగ్గరగా

వచ్చి చేతి కందిస్తూఉంటే సిగ్గో, సంతోషమో, పారవశ్యమో మాట పెగిలిరాదు. 'అత్తయ్య ఎందుకు రాలేదు?' అని అడుగుతుంది. 'నేను వచ్చానుగా' అంటాడు తాను, ఏమనాలో తోచక. 'దేవుడి దయవల్ల నాకు కళ్ళజోడు పెట్టుకోకపోయినా మనుషులు కనిపిస్తారు' అంటుంది వల్లి, తన కళ్ళజోడు తీసి హేండ్ కర్చీఫ్‌తో తుడుచు కుంటూ వల్లి సమయస్ఫూర్తికి, పరిహాసానికి పొంగిపోతాడు. తన కళ్ళజోడునుగూర్చి వేళాకోళం! అల్లరిపిల్ల ఎంత చమత్కారంగా బాగా మాట్లాడుతుందో? ఈ వల్లి తనది కాకపోతే? ఈఆలోచన వస్తే మార్కండేయుల వారిని యముడు పాశం వేసి లాక్కునిపోతున్నట్లు, తానే మార్కండేయుడైనట్లు వణుకు పుడుతుంది. కళ్ళు తడి అయి పోతవి. తన నెవరో, ఎక్కడికో బలవంతంగా లాక్కునిపోతున్నట్లు బాధ. రమణకు ఇల్లంతా వల్లే కనపడుతున్నది. కుక్కి నులకమంచం హంసతూలికా తల్పంగానూ, పెంకుటిల్లు దివ్యహర్మ్యంగానూ కన పడుతున్నాయి. ఈసరికి రైలు వచ్చివుంటుంది. పన్నెండూఇరవై కి తిరిగిపోతుంది.

పీట వేసి కంచంపెట్టి అమ్మ పిలిస్తే పోయి కూచున్నాడు రమణ. తన తొందరపాటు తనంతటతనకే నవ్వుతెప్పిస్తున్నది. ఆకలి కావడంలేదు. రోజూ పదిగంటలకల్లా అన్నం తిని ఆఫీసుకుపోయే తనకు ఇవాళ పదకొండున్నర అయినా ఆకలే కావటంలేదు. అమ్మకు మనస్సులో తనతో ఎన్నోవిషయాలు మాట్లాడాలని ఉన్నదని తనకు తెలుస్తూనేఉంది. ఆమె కళ్ళలో తాను చందమామలాగా కన పడటం కనిపిస్తూనేఉంది. తన నెంత కళ్ళలో నింపుకుని చూస్తు న్నదో! రమణ ఆ చూపుకు కరిగిపోయినాడు. తాను చిన్న పసిపాప అయిపోతున్నట్లుగా భావించుకుంటున్నాడు. అమ్మ ఏమీ మాట్లాడదు. తాను వాక్కోముద్దే ఎంతో ప్రయత్నంమీద మింగుతున్నాడు. తల్లి కూర వడ్డించబోయింది. చేయి అడ్డంపెట్టి వద్దన్నాడు.

"దాని కేకూర ఇష్టం'' అంది అమ్మ.

అమ్మ వేపు చూడలేకపోయాడు. నవ్వూ వచ్చింది.

"ఓ పొట్లం కట్టిఇవ్వరాదూ?"

తల్లి దేవాలయంలో గంటలు మోగినట్లు పగలబడి నవ్వింది. తానుకూడా నవ్వొచ్చేట్లు మాట్లాడగలడు కాబోలు నని రమణకు గర్వం కలిగి తనకూ నవ్వొచ్చింది. ముసిముసి నవ్వులతో తల వంచుకున్నాడు. అమ్మకు దేవతలందరూ తన ఎదుట నిలిచి తనను అనుగ్రహించినట్లు అనిపించింది.

పులుసు పోస్తూ "ఓవేళ అత్తయ్య ముఖం చిన్నపుచ్చుకున్నా దాంతో నీవేమైనా అనేవుసుమా. నీతోపాటు నాకూ రావాలని ఉందిరా. మావయ్యతో చెప్పు. ఈ నెలలో అమ్మ వస్తుందనీ, శ్రావణం దగ్గర పడుతున్నదని నీతో చెప్పమన్నదనీ చెప్పు. నీకేమో నోట్లో నాలుక లేదు. అందుకే వల్లి నీకు పెళ్ళామైతే నాకు నీగురించి ఏ దిగులూ వుండదు. కొంచెం చాయ తక్కువగాని లక్ష్మీదేవికూడా అలా వుండదు.

రమణ నవ్వాడు.

"లక్ష్మీదేవి ఇంతకన్నా చాయ తక్కువా?"

తల్లి ప్రేమగా నవ్వింది.

"వల్లి నీకన్నా ఎరుపే."

"పోనీవే, నేనెలా ఉంటేనేం....?"

"అవునురా. మగవాడు ఎలావున్నా దొరే. కోడలు నలుపైతే కులమంతా నలుపే."

రమణ చేయి కడిగేసుకున్నాడు.

"కంచంలో ఇంకెన్నాళ్లు చెయి కడుగుతావులే" అంటున్నది అమ్మ.

ఆ మాటలు ఎంతో మధురంగా ఉన్నాయి రమణకు.

అమ్మ వల్లి కొంచెం చాయ తక్కువంటుంది కాని తనకు మొగలిపొత్తులానూ, గులాబిమొగ్గగానూ, సంపెంగ పువ్వులాగానూ, రాజహంసలాగానూ కన్పిస్తుంది.

అసలు వల్లినిగురించిన ఆలోచనే తన కింత మధురంగానూ, ఆశగానూ, తృప్తిగానూ, హాయిగానూ వుంటుం దేమిటి!

తను సంచీతీసుకుని బయలుదేరుతుంటే అమ్మ చెప్పింది.

"దాని మనసు మెత్తన. మామయ్య తొందరవాడు. అత్తయ్యకు తగని గర్వం. ఎవరి మనసూ నొప్పించవద్దు. రెండురోజులుండి మనవాళ్ళందరినీ చూసి, మామయ్యచేత ఔననిపించుకొని రా నాయనా" అన్నది.

రమణ తలఊపి వీధిలోకి వచ్చాడు.

కొంతదూరం నడిచిన తరువాత అప్రయత్నంగా ఎవరింట్లోనో గోడగడియారం పన్నెండు అయిందని చెపుతూ కన్పించింది. రిక్షా కోసం చూసినా వెంటనే కన్పించలేదు. త్వరత్వరగా పరిగెత్తుతున్నట్లుగా నడక సాగించాడు. రైలుస్టేషన్‌ను చేరుకున్నాడు. రైలు ఏ నిముషాన కదులుతుందోనని అంతులేని ఆందోళన! ప్రక్కలైనుమీద గూడ్సుబండి కూతపెట్టినా, నీళ్ళు నింపుకుంటున్న ఇంకో ఇంజను గుప్పుగుప్పున పొగవదలి కదిలినా రమణ మనస్సంతా ఆరాట పడిపోతున్నది. ఎట్లా అయితేనేం తన ఎట్టఎదురుగా కన్పించిన పెట్టెలోకి ఒక్కసారిగా ఎగిరిదూకినట్లుగా పోయి జొరబడ్డాడు. అతని తొందరపాటుకూ, విభ్రమానికీ, ఆయాసానికీ అక్కడున్నవాళ్ళకు నవ్వొవచ్చింది. బండి ఆ స్టేషన్‌నుండే బయలుదేరుతుంది కనుక కొంచెం నిదానించి చోటు ఉన్నదీ లేనిదీ చూచుకునే పెట్టెలోకి ఎక్కవచ్చు. కాని దానికి వ్యతిరేకంగా ఇతడు మనుషులను నెట్టుకుంటూ ఆ పెట్టెలోకి ఎక్కినందుకే వాళ్ళకు చోద్యంగానూ, పరిహాసంగానూ వుంది. పైగా అత డనుకున్నట్లు రైలు వెంటనే బయలుదేరనూ లేదు. అట్లా బయలుదేరివుంటే తన తొందరకు కొంత అర్థముండేది. పోనీ దిగిపోదామనీ అనిపించలేదు. ఒకపక్క వొదిగి నిలుచున్నాడు. ఆ పంచాయతీ బోర్డుమెంబరు తన క్లాస్‌మేటే. అతడు ఫోర్తుఫారం మూడవసంవత్సరం చదువుతుండగా ఆ యేడు తాను ఫోర్తుఫారంలోకి వచ్చాడు. తమఊరికి దగ్గరవున్న చిన్న పల్లెటూరినుంచి వచ్చే

వాడు అతడు. పెద్ద ఆస్తిపరుడని మేష్టర్లందరూ ఏమీ అనేవాళ్ళు కారు. తాను ఫోర్తుఫారం ప్యాసై ఫిఫ్తుఫారంలోకి వచ్చాడు. ఆ యేడు అతను తప్పి ఇక స్కూలుకురావటం మానుకున్నాడు. అటు తరువాత మెట్రిక్ చదువుతున్నానంటూ నాలుగైదేళ్ళు గడిపాడు. అటు తరువాత నాలుగైదేళ్లు తాను కాలేజీచదువులు పూర్తిచేసుకుని అతని విషయమే మరచిపోయినాడు. మళ్ళీ ఉద్యోగంలో చేరినతరువాత ఎవరి నోటంటనో అతడు పంచాయతీబోర్డు మెంబరు కావటమూ, రాజకీయాలలోగూడా ప్రసిద్ధుడు కావటమూ, అనేకమంది అతణ్ణి ఆశ్రయించటమూ విన్నాడు. చూశాడు. ఈవల కూచునిఉన్న బట్టల షాపు యజమానికూడా కొంచెం పరిచయమే. పావుగంట గడచి పోయింది. రైలు కదిలే సూచన కనిపించలేదు. రమణకు ఒకనాటి సంఘటన గుర్తువచ్చింది.

గుంటూరువెళ్ళి మామయ్యగారింటినుంచి తిరుగుప్రయాణం చేస్తున్నాడు. వల్లిగూడా వస్తున్నది తనతోపాటే. వల్లి కప్పుడు తొమ్మిదోయేడు. తనకు పదిహేనో పదహారో ఉండవచ్చు. ఇంటర్ మీడియట్‌లో చేరిన రోజులు. మామయ్యగారింటికి వెళ్ళి రెండురోజు లుండి తిరిగివచ్చేస్తుంటే వల్లి తానూ వస్తానని పట్టుపట్టింది. తల్లీ దండ్రీ ఎంత నచ్చచెప్పినా వినలేదు. అయినా అప్పటికి అత్తయ్యకు గాని, మామయ్యకుగాని తమయెడల వైమనస్యం ఏమీలేదు. వల్లిని తన పెళ్ళా మంటూ ఉండేవాళ్లు. వారంరోజు లుంచుకొని మళ్ళీ తానే వచ్చి దిగబెట్టి పోతానన్నాడు రమణ. మామయ్యా అత్తయ్యా వొప్పుకున్నారు. వల్లి తనతో వచ్చింది. ఆరోజు తన కెంత సంతోషం కలిగిందో. స్టేషనుకు వచ్చిన తరువాత 'ఏమైనా తిందామా వల్లీ' అని అడిగాడు తను. వల్లి ససేమిరా తా నేమీ తిననంది.

"నేను కాఫీతాగి వస్తా" నన్నాడు.

చొక్కాపట్టుకొని "వద్దు బావా! నే నొక్కత్తినీ వుండలేను" అంది వల్లి.

ఇప్పుడే వస్తానని చెప్పి రమణ ప్లాట్‌ఫారంమీది రెస్టరెంట్

లోకి వెళ్ళాడు. ఏదో కొంచెం టిఫిన్ తిని కాఫీ తాగుతున్నాడు. కాఫీ భరించలేనంత వేడిగావుంది. ఎంత ఆరబోసినా ఇంకా వేడిగానే వుంది. ఇంతలో అవతల ప్లాట్ ఫారంమీద వున్న రైలు చెవులు చిల్లులుపడేలా కూత పెట్టింది. తమ రైలే కదిలిపోతున్న దనుకుని ఆ తొందరలో ఏమీ తోచక గబగబా గ్లాసుఎత్తి ఒక గుక్క కాఫీ నోట్లో పోసుకుని చటుక్కున మింగాడు. గొంతంతా ఒకేవిధంగా మండి పోయింది. అక్కడక్కడే పడిపోతానేమో ననిపించింది. కళ్ళవెంబడి గిర్రున నీళ్ళు తిరిగాయి. గుండెలుకూడా మండిపోతున్నాయి. ఆ గ్లా సక్కడే వదిలేసి ప్లాట్ ఫారంమీద పరిగెత్తాడు. నాలికంతా చురచుర మండి మొద్దుబారిపోయింది. తీరా చూస్తే కూతపెట్టింది తమ రైలు కాదు. ఆ వేపున బెజవాడపోయే రైలు అది. రమణ వెళ్ళి వల్లిపక్కనే కూచున్నాడు బెర్త్‌మీద. "అదేమిటి బావా! కళ్ళు ఎర్రగా వున్నాయి! ముఖమంతా ఎందు కట్లావుంది?" అని అడిగింది వల్లి.

రమణ జరిగిందంతా చెప్పాడు. వల్లికి కళ్ళవెంబడి నీళ్ళు తిరిగాయి. సుతారమైన తన సన్నని వేళ్ళతో గొంతునూ గుండెనూ నిమిరింది. "ఏమంత తొందర! ఒకవేళ రైలు కదిలిపోతే నే నొక్క దాన్నీ వెళ్ళలే ననుకున్నావా? మీ నరసారావుపేట ఒక మహా పట్నమా? మీ ఇల్లు నేను కనుక్కోలేకపోయేదాన్నా" అని మందలించింది. రమణ ఏమీ మాట్లాడలేదు. గుంటూరునుండి నరసారావుపేట చేరేసరికి వందమాట్లు అడిగింది. 'బావా, గొంతు ఎలా వుంది? ఇంకా నొప్పిగానే వుందా?' వల్లికి ఎంత దిగులైందో అవాళ! ముద్దబంతిలాగా వుండే ముఖం కాస్తా చిన్నపోయింది. పూలపరికిణీ వేసుకుని చుక్కలగౌను తొడుక్కుని చిన్నచిన్న రెండుజడలలో మల్లెపూలు పెట్టుకుని అమిత సంతోషంగా తనతో బయలుదేరిన వల్లి ప్రయాణంలో అంతా దిగులుగా, దుఃఖంగా, ముఖం చిన్నపుచ్చుకుని కూచుంది. ఇంట్లోకి వెళ్ళగానే అమ్మ వల్లిని రెండుచేతులా గుండెకు పొదువుకుని ముద్దుపెట్టుకుని ఉప్పొంగిపోయిం దా వేళ. అమ్మ అడుగుతున్న క్షేమవార్తలకు సమాధానం చెప్పకుండా బావకు గొంతు

కాస్తా వేడివేడి కాఫీతో కాలిపోయిన ఉదంతాన్ని చెప్పుకుంటూ వచ్చింది వల్లి. ఆ వారంరోజులూ వల్లిని చిన్నపాపను చేసి అడుగు కిందపెడితే కందిపోతుందేమో నన్నట్లు చూసింది తల్లి. జడవెయ్యటం, నీళ్ళుపోయటం, కొత్త గౌన్లూ పరికిణీలు కుట్టించటం, ఇరవైనాలు గ్గంటలూ, ఆ పిల్లపోషణా, ఆ పిల్లను గురించిన శ్రద్ధా తప్ప ఇంకేవీ పట్టించుకునేది కాదు. తమ ఇద్దరికీ ఒకేసారి అన్నంపెట్టేది. ఇద్దరి తోనూ కబుర్లుచెపుతూ కూచునేది. అట్లా ఆ రోజులు మధురంగా గడచిపోయినయ్. శెలవులు వచ్చినప్పుడల్లా తాను గుంటూరు వెళ్ళే వాడు. వల్లితో కబుర్లుచెపుతూ ఆడుతూ పాడుతూ కాలక్షేపం చేసే వాడు. వల్లి పెరిగి పెద్దదవుతున్నకొద్దీ అల్లరికూడా ఎక్కువ నేర్చు కుంటూ వచ్చింది.

ఎప్పుడూ "కాఫీ చల్లార్చి తాగు బావా! ఒక్కసారిగా గొంతులో పోసుకోకు. నేను చల్లారబోసి ఇస్తా వుండు" అంటూ వేళాకోళం చేసేది. వల్లి రోజురోజుకూ ఇంకా ఇంకా అందంగా తయారవుతూ వచ్చింది. తాను బి. ఏ. ప్యాసైనాడు. మామయ్యా గారింటికి ఇదివరకటంత తరచుగా రాకపోకలు లేవు. తా మిద్దరూ పెద్దవాళ్ళయినారు.

కాని ఆ తలపులు ఇరువురకూ మనోహరంగా ఉండకపోవు. కాని ఇటీవలగా ఎందుకో మామయ్యా తన యెడల కొంత ముభావం చూపిస్తూ వుండటమూ, అత్తయ్యా నిరసన కనపరుస్తూ వుండటమూ రమణ గ్రహింపకపోలేదు. వల్లికి ఇద్దరు తమ్ముళ్ళున్నారు. వాళ్ళు బాగా చిన్నవాళ్ళు. ఎనిమిదేళ్ళ వాడొకడు, ఐదేళ్ళ వాడొకడు. ఇప్పుడు మళ్ళీ వల్లికింకో చెల్లెలు. ఆ పిల్లలందరూ తన దగ్గరకు చనువుగా రారు. మామయ్యా కూడా ఎవరో దూరపుచుట్టం ఇంటికి వచ్చినట్లుగా మెసిలేవాడు తనని చూసి. అత్తయ్యా సరేసరి, మరోమారు తాను వాళ్ళింటికి వెళ్ళకుండా వుండటానికి అవసరమైన జాగ్రత్తలన్నీ తీసు కునేది, తనను చూడగానే. వల్లి తల్లిని చీదరించుకునేది. కాని తాను పెద్దదైపోయినందువల్ల చనువునూ, అభిమానాన్నీ ఇంకా ఎక్కువ ఎలా చూపగలదు?

రమణకు తండ్రి పన్నెండో ఏటే చనిపోయాడు. ఇద్దరు అక్కయ్యలున్నారు. వాళ్ళిద్దరికీ తండ్రి పెళ్ళి చేసేపోయాడు. తమ్ముడొకడు వుంటే వాడు పినతండ్రి దగ్గర స్కూల్లో చదువుకుంటూ శెలవులిచ్చినప్పుడు వచ్చిపోతూ వుంటాడు. తండ్రి చనిపోగానే మామయ్య తన కుటుంబాన్ని అభిమానంగానే చేరదీశాడు. ఒకటి రెండేళ్ళు తన దగ్గరే వుంచుకున్నాడు కూడా. తరువాత తల్లే గుంటూరునుండి వచ్చేసి తన పిల్లవాడిని స్కూల్లో చేర్పించి చదువు చెప్పించి ప్రయోజకుణ్ణి చేసింది. అక్కయ్యావాళ్లు రాజమండ్రిలో వుంటే నాలుగేళ్ళ కాలేజీ చదువు అక్కడే పూర్తి చేసుకున్నాడు రమణ. ఈ నాలుగేళ్ళలో ఏ రెండుమూడుమార్లు వెళ్ళాడో మామయ్యగారింటికి బి. ఇడి. చదువుదా మనుకున్నాడు. కాని అవసరం లేకుండానే కోఆపరేటివ్ డిపార్టుమెంటులో ఉద్యోగం వచ్చింది. ఉన్న వూళ్ళోనే ఉంటున్నాడు. రెండేళ్ళనుంచీ, మామయ్య పిల్లనిస్తానని వస్తాడేమో! ఆ శుభముహూర్తం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారు. కాని మామయ్య జాప్యం చేస్తున్నాడు. ఎవరో బంధువులు, ఇంకేమీ పనిలేనివాళ్లు వాళ్ళ పిల్లకు మామయ్య వేరే సంబంధాలు చూస్తున్నాడనీ, మీ అబ్బాయికి ఫలానివాళ్లు పిల్లనిస్తామంటున్నారనీ, నాలుగువేలు కట్నం కూడా యిస్తామంటున్నారనీ అప్పుడప్పుడు అటు పోతూ, ఇటు వస్తూ అమ్మ చెవిని ఏవేవో వింతలూ విశేషాలు వినిపించిపోతూ వుండేవాళ్ళు. అమ్మకు వాళ్ళంతా ముళ్లు గిరుకునిపోతున్నట్లుండేది ఆ మాటలు వింటుంటే. వీళ్ళందరికీ ఏమి టీ కసి! అసూయ? తన బ్రతుకంతా యిలాబండలై పోవటం కాకుండా, మనుషుల దుశ్చింత,స్వార్థం తలచుకొని ఆమె కుంగిపోతూ కళ్ళనీళ్ళు పెట్టుకునేది. తల్లిపోతే మేనమామ అండన చేరమని సామెత. అటువంటిది తన తమ్ముడు తనయెడలా, మేనల్లుడియెడలా ఇటువంటి వైముఖ్యమూ వైమనస్యమూ చూపటం దేనికి? ఆ ప్రేమలూ, అభిమానాలూ ఎటు పోయాయి? తాను చదువు చెప్పించమనీ, సంసారాన్ని ఆదుకోమనీ,తన బరువునూ బాధ్యతనూ తమ్ముడి

మీద పడవేయలేదే.తమ్ము డిలా ఎందుకు మారిపోయినాడని విలవిల లాడిపోతుండేది. ఈ మధ్య వొకటి రెండుసార్లు వెళ్ళినా కొడుకు పెళ్ళి విషయం ప్రస్తావించినప్పుడు తమ్ముడు ముభావం చూపటం, ఆడపడుచు విరసంగా మాట్లాడటం, తల్లి వాళ్ళ ప్రవర్తనను తలుచు కొని తనతో చెప్పలేక ముఖం చిన్నపుచ్చుకొని మనసులోనే దిగ మింగుకోవటమూ రమణ మనస్సులో వొకదాని వెనుక వొకటి అన్ని సంఘటనలూ తిరిగాయి.

రైలు ఇప్పటికి కదిలింది. రమణ మనస్సుకు కొంత శాంతి కలిగింది. తలుపుదగ్గర వున్న రైతువెళ్ళి బెర్తుమీదవున్న మనుష లను సర్ది, దబాయించి, చోటుచేసుకుని కూచున్నాడు. రమణ తాను వెళ్ళి కూచోలేకపోయాను కదా అనుకున్నాడు. తనను కూచోమని కూడా ఎవరూ అడగలేదు. రెండోవైపు బెర్తులో తనలాంటి అతనే వొకతను కూచున్నాడు, ఇంగ్లీషు దినపత్రికను దేనినో చూస్తూ.

మొదటి స్టేషను రాగానే పెరుగుతట్ట మనిషి, రైతూ దిగి పోయారు. రమణ వెళ్ళి అతని పక్కన కూచున్నాడు. అతడు తన చేతిలోని పేపరు మడిచి 'పేపరు చూస్తారా' అని యిచ్చాడు. రమణ పేపరు తీసుకొని మర్యాదకు హెడ్డింగ్స్ అన్నీ వోసారి చూశాడు. ఏం చదువుతున్నా మనస్సు లగ్నం కావటంలేదు. ఏదో చదివేస్తు న్నాడు. మనస్సంతా వల్లి నిండిపోయింది. ఎప్పుడెప్పుడు వెళ్ళి వల్లిని చూస్తానా అని మనస్సు వురకలు వేస్తున్నది. కళ్ళలో వల్లి గుండ్రని ముఖమూ, చిరునవ్వు చిందులాడే పెదవులూ, చక్రాల్లాంటి కళ్ళూ మాత్రమే కనపడుతున్నాయి. అన్ని ఆలోచనల మధ్యా వల్లిదే ప్రధాన స్థానం.

మామయ్య ఇదివరలో చాలా అభిమానంగా వుండేవాడు. అటువంటిది ఎందుకో ఇప్పుడు ఔదాసీన్యం చూపుతున్నాడు.రెండేళ్ళ క్రిందట మామయ్యకు పెళ్ళాం తరపున కొంత ఆస్తి వచ్చిపడింది. దాంతో మామయ్య ప్రవృత్తి కాస్తా మారిపోయింది. అత్తయ్యకు మేనత్త ఎవరో సంతానం లేకుండా చనిపోతే ఆవిడ తాలూకు లక్ష

రూపాయల ఆస్తి రావటంతో వాళ్ళ అభిరుచులు, ఆలోచనలు, ఆదర్శాలు, ఆభిజాత్యం కూడా పూర్తిగా మారిపోయినయ్. ఇప్పుడు ఆకాశంమీదనే వాళ్ళ చూపు. భూమిమీద యేమాత్రం నిలవటంలేదు. బంధువులయెడ, తమయెడ తృణీకారం మెండైంగి.

వల్లిని తనకివ్వటం అత్తయ్యకు బొత్తిగా ఇష్టంలేదు. తనకు కాబోయే అల్లుడు లక్షాధికారికావాలనీ, లేకపోతే కనీసం ఏ కలెక్టరో, ఇంజినీరో కావాలనీ. లేదా యాభై అరవై యెకరాల మాగాణివుండాలనీ, ఇంకా లేదా, రోజూ వో వంద లాభంతెచ్చే యేదేనా వ్యాపారం చేస్తూ వుండాలనీ, అభిలాషపడుతున్నట్లు వీరూ వారూ చూచాయగా గ్రహించకపోవటం లేదు. అట్లా గ్రహించినవారు ఊరుకుంటే సరిపోను. యథాశక్తి ప్రచారంకూడా చేస్తున్నారు. కర్ణాకర్ణిగా వచ్చి యీ ప్రచారం తల్లీ కొడుకులను ఖేదపరచటంలో విచిత్రం కూడా యేమీ లేదు. అలా యెవరైనా వచ్చి మామయ్య యేమన్నదీ, అత్తయ్య ఉద్దేశా లెటువంటివైనవీ ప్రసంగించేవాళ్ళు.

అంతటితో పోకుండా ఇవతలివేపు వాళ్ళ అభిప్రాయాలు, వ్యాఖ్యానాలు, చింతలు, చీకాకులూ కూడా వినాలని ఆశించేవాళ్ళు. ఒకసారి యెప్పుడో వుండబట్టలేక అమ్మ అన్నది:

"ఏం, మేమెంత హీనస్థితిలోవున్నా వాడికి కూడా అలుసైపోయామా! మేమేం తిరిపెమెత్తుకుని బ్రతకటంలేదు. మా అబ్బాయి చదువుసంధ్య లెరుగని మూర్ఖుడుగాడు. ఏదో ఉద్యోగం సద్యోగం వుంది. మా బ్రతుకు మేము బ్రతుకుతున్నాము. తండ్రి లేడనేకదా వాడికి అలుసు! తండ్రి వుంటే వా డిట్లా అని వుండేవాడేనా! మేనరికమైనా చూడవద్దా? మేనరికమంటే ఏమనుకుంటున్నాడో వాడు! లోకులు నలుగురూ ఏమనుకుంటారోనన్న ఇంగితమైనా వుండవద్దా? ఎట్లా తన కూతురును మేనల్లుడికివ్వడో నేనూ చూస్తాను. మా బాబాయిని, మా మామయ్యను, అత్తయ్యను, అందర్నీ తీసుకవెళ్ళి వాడికి బుద్ధి చెప్పిస్తాను."

ఈ చిన్న తాటాకు టపాకాయను పదిలంగా తీసుకవెళ్ళి

శ్రేయోభిలాషులు మామయ్య, వెరసి అత్తయ్యా యాజ్ఞ యాజ్ఞవల్క్యా అత్తయ్య (ప్రస్తుతం కొన్నాళ్ళనుంచి) ముందు కాల్చారు. దాంతో ఆ ఇంట్లో గొప్ప సంచలనమే బయలుదేరిందని మళ్ళీ అభిజ్ఞులు కొందరు వచ్చి ఇక్కడ చెప్పారు. దాంతో అమ్మ భయపడిపోయి, తన బృందంతోపోయి చేద్దామనుకున్న సుహృద్భావ పర్యటననుండి విరమించుకుంది. ఇంచుమించు యెవరికివారు వాళ్ళవాళ్ళ హద్దుల్లో ఆత్యయిక పరిస్థితిని ప్రకటించుకున్నారు.

కొన్నాళ్ళపాటు సమావేశాలను బహిష్కరించారు. ఈ ఆలోచనలన్నీ రమణ మనస్సును కమ్ముకుంటున్నాయి. లోకంలో ఏ సంఘటన ఎప్పుడెప్పుడు, ఏయే పరిణామాలకు దారితీస్తుందో ఎవరూ చెప్పలేరు. నిజానికి వేదాంతం చెప్పుతున్నది కూడా అంతేగదా. అత్తయ్య మేనత్త ఇంకా పదేళ్ళు, కనీసం ఐదేళ్ళు బతికివున్నా యీ విషమసమస్య తాను ఎదుర్కొనవలసి వచ్చేదికాదు. వల్లి అనే రామచిలుక ముక్కున తాను దొండపండుగానే చెలామణీ అయ్యేవాడు.

ఇప్పుడు తద్వ్యతిరిక్తంగా వుంది. అత్తయ్య ఆలోచనను రమణ మనసులో కూడా మననం చేసుకోలేకపోయాడు. ఎంత ప్రయత్నించినా, అస్పష్టంగానైనా అత్తయ్య అంతరాంతరాలలోని 'కాకి ముక్కుకు' సామ్యం తన వూహకు అందకుండా ఉండకపోలేదు. బలవంతాన అత్తయ్యకు తననుగూర్చి ఎట్టి అభిప్రాయాలున్నవో ఆలోచించటంనుండి తన మనస్సును మళ్ళించుకున్నాడు రమణ.

ఏది ఏమైనా వల్లికూడా తనతో చనువుగా మాట్లాడటంలేదు యీ మధ్య. తాను వల్లిని చూసి రెండు సంవత్సరాలకు పైగానే అయింది. లేక అత్తయ్య ఆలోచనల తాకిడికి, అత్తయ్య వ్యక్తిత్వ ప్రభావానికి వల్లికూడా లోబడిపోయిందేమో! 'మా అమ్మాయికి ఇప్పుడే పెళ్ళి చెయ్యం. కాలేజీలో చేరి చదువుకుంటుంది. బి. ఏ. ప్యాసుకాంది పెళ్ళేమిటి? ఎన్నేళ్ళు ముంచుకపోయాయి గనుక' అని అత్తయ్య అంటే దానికిమాత్రం వల్లి తీవ్రంగా తన అభ్యంతరాన్ని వెల్లడించిందట.

"నాకు బి. ఏ. మీద ఇష్టంలేదు. నేను ఉద్యోగం చెయ్యలేను. కావలిస్తే కొన్నాళ్ళపాటు సంగీతం నేర్చుకుంటాను. అదీ వస్తేగిస్తే" అన్నదట వల్లి. దానికి చాలా సంతోషించాడు రమణ. వల్లి కూడా బి. ఏ. ప్యాసై కూచుంటే....బావను చేసుకోనంటే...ఇక ఆలోచించ లేకపోయాడు. మామయ్య ఇటీవల రాజకీయవేత్తలాగా ఇంకో ఎత్తు ఎత్తాడు. "మేనరికం వదులుకోవాలని ఎవరుమాత్రం అంటున్నారు? మేనరికం ఇవ్వాలంటే వల్లినే ఇవ్వాలనిమాత్రం ఎక్కడుంది? మా చంటిపిల్లను చిన్న మేనల్లుడి కివ్వగూడదా ఏమిటి?"

ఈ మాటన్నప్పుడు అమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుని "తల్లి చెవులు తెంపినవాడికి పినతల్లి చెవులు తీర పువ్వులట. రమణ కివ్వనివాడు చిన్నవాడి కిస్తాడా? అయినా అప్పటికి నా ప్రాణమొకటి చల్లగావుండ వద్దూ! వాడు మేనరికం తప్పించాలన్న వూహతోనే ఇట్లా మాట్లాడు తున్నాడు" అన్నది.

రమణ కా దృశ్యాలన్నీ గుర్తు వచ్చినయ్.

తన చేతిలోవున్న పేపరును మడిచి ఎదుటి బెర్తుమీద ఉన్న అతడికి యిచ్చేశాడు. అతడు తన కూలింగ్గ్లాస్‌ను వోసారి తీసి జేబు రుమాలుతో తుడిచి మళ్ళీ పెట్టుకుని పేంట్ జేబులోనుండి ఖరీదైన సిగరెట్ పెట్టెను తీసి వెలిగించుకొని వొక సిగరెట్ రమణనుకూడా తీసికొమ్మని రమణవేపు చేయిజాపాడు. రమణ తన కలవాటులేదని మర్యాదగా చెప్పి అతడు తనను విచిత్రంగా చూస్తుంటే మనసులో నొచ్చుకున్నాడు. ఆ ఖరీదైన బట్టలు, ఖరీదైన కూలింగ్గ్లాసెస్, సిగరెట్లూ-అతడు థర్డ్‌క్లాస్ కంపార్టుమెంటులో ప్రయాణంచెయ్యటం విచిత్రం అనుకున్నాడు రమణ.

ఎదుటి వ్యక్తే అడిగాడు. "మీ రెక్కడికి వెళ్తున్నారండీ?" అతడి గొంతూ, ఆ మాట్లాడుతున్న తీరూ చాలా మర్యాదనూ, సంస్కారాన్నీ వ్యక్తం చేస్తున్నాయి. అటువంటి మనుషులంటే రమణకు చాలా యిష్టం.

రమణ సమాధానం చెప్పాడు:

"మీది గుంటూరేనా అసలు" మళ్ళీ అత డడిగాడు.

రమణ క్లుప్తంగా తననుగురించి పరిచయం చేసుకున్నాడు.

"ఆఫీసు పనిమీద వెళుతున్నారా?" అని అతగాడు మళ్ళీ అడిగాడు.

రమణ కాదని చెప్పాడు.

ఇంతలో ఫిరంగిపురం స్టేషన్ వచ్చింది. ఆవేపునుంచి వచ్చే రైలు క్రాసింగుకోసం ఆగివుంది స్టేషనులో.

ఎవరో పాపం! ఇరవైఏళ్ళ అమ్మాయి పాపను ఎత్తుకుని త్వరత్వరగా కంపార్టుమెంటులోకి ఎక్కింది. తమ్ముడు కాబోలు సూట్ కేసు చేతబట్టుకొని "ఆడవాళ్ళపెట్టె ఖాళీగానే ఉందక్కయ్యా! అందులో ఎక్కుదువుగాని రారాదూ?" అంటున్నాడు.

"ఈ ఎండలో నేను తిరగలేనురా నాయనా! ఇక్కడే కూచుంటాను లేస్తూ, అర గంటలో వెళ్ళి పోవచ్చును." అన్నది ఆ అమ్మాయి.

రమణ లేచి ఆవిడకు తనచోటు యిచ్చాడు. ఆవిడ కళ్ళలో కృతజ్ఞత వుట్టిపడే చూపులతో కూచుంది. ఎదుటిసీటులోఉన్న అతడు సర్దుకుని రమణను తనపక్కన కూచోమని కోరాడు; రమణ సర్దుకుని కూచున్నాడు. ఆ స్టేషనులో బండిఎక్కిన అమ్మాయి తమ్ముడు అక్కయ్య కూతురిని పదేపదే ముద్దుపెట్టుకుని పలకరించి వెళ్ళి పోయాడు.

"ఎండలో తిరక్కుండా ఇంటికి వెళ్ళరా" అంటున్నది వాళ్ళక్కయ్య.

రమణకు తన అక్కయ్య గుర్తుకువచ్చింది. ఆమెకూడా ఎప్పుడూ తననిగూర్చి అమితమైన శ్రద్ధ వహించేది.

రైలు కదిలింది. ఎదుటిసీట్లోఉన్న పాప వాళ్ళమ్మ వాళ్ళో కూచుని తనఎదుట రమణ పక్కనే కూచున్న వ్యక్తి కూలింగ్ గ్లాసెస్‌వేపు వింతగా చూస్తున్నది. అతడు తన కళ్ళజోడు తీసేసి పాపను పలకరించి నవ్వించాడు. వాళ్ళమ్మ గర్వంగా పెదవులు బిగబట్టి తన చూపు ఎటో మళ్ళించుకుంది.

"గుంటూర్లో యెక్కడ దిగుతారు మీరు?" అని అడిగాడతడు రమణను.

"అరండల్‌పేట ఆరవలైనులో ఉంటా నీ మూడురోజులూ" అని చెప్పాడు రమణ.

"ఓహో! అలాగా? నేను బ్రాడీపేట నాలుగోలైనుకు వెళ్ళాలి లెండి. అయినా రేపు నేను మీ అరండల్‌పేట ఆరవలైనుకు రావాలి" అన్నా డతడు నవ్వుతూ.

రమణకు ఉత్సుకత కలిగింది.

"ఎందుకు? ఎన్నాళ్ళుంటారు గుంటూరులో?" అని అడిగాడు రమణ.

"ఎన్నాళ్ళో ఎలావుండగలనండీ?కర్నూల్లో పెద్ద మెడికల్‌షా పుందిమాకు. నంద్యాల్లో ప్రెస్సుంది. మార్కాపురంలో స్లేట్‌ఫ్యాక్టరీ వుంది. ఒక్క క్షణం నేను లేకపోతే బిజినెస్ అంతా దెబ్బ తింటుంది........."

"ఈ రోజుల్లో ఎవరినీ నమ్మరాదండీ. ఎంతో జాగ్రత్తగా ప్రవర్తించాలి. నరసారావుపేటలో మా అక్కయ్యవుంది. ఆవిడను చూసి చాలారోజులైతే ఒకపూట చూసిపోదామని వచ్చాను. గుంటూర్లో బావగారికి కూడా మెడికల్‌షాపే. నేనొక్కణ్ణే మా తలిదండ్రులకు మగపిల్లవాణ్ణి. మా అమ్మా, నాన్నా కర్నూల్లో వుంటారు. నాకు చిన్నప్పటినుంచీ సరిగా చదు వబ్బలేదండీ. మెట్రిక్ ప్యాసై.చదువు మానేశాను.

"ఏదో బిజినెస్‌లోనే కలిసొస్తున్నది.ఇక్కడికి వచ్చానా, మా అక్కయ్య ఒక పెటకం పెట్టింది. మీకు తెలుసుగా, యీ రోజుల్లో పాతికేళ్ళ మగవాళ్ళు కనిపిస్తేసరి. పెళ్ళి, పెళ్ళి అని వెంటబడతారు. మా ఇద్దరక్కయ్యలూ కూడబలుక్కుని నాకో పెళ్ళిసంబంధం చూశారు. చూడటమేమిటి! ఇంచుమించుగా స్థిరపరిచారు. నిశ్చయం చేశారు. నేనా పిల్లను చేసుకోకపోతే తరువాత నేనేపిల్లను చేసు కున్నా చేసుకోకపోయినా వారికేమీ సంబంధం లేదట నాతో. ఒకవేళ

నేను యీ సంబంధం కాక వేరే సంబంధం చేసుకుంటే వాళ్ళు నా పెళ్ళికే రారట."

రమణ మంత్రముగ్ధుడిలాగా వింటున్నాడు. ఎదుటి బెర్తుమీద కూచునివున్న అమ్మాయి చిరునవ్వు ముఖంతో, ఆసక్తిగా చెవు లప్ప గించి వింటున్నది. పాపకూడా ఏమిటో అర్థమైనట్లు చూస్తున్నది.

"అబ్బ! పెళ్ళి అనగానే మన స్వేచ్ఛ కాస్తా పోతుందండీ.." మనస్సులో అతడి అభిప్రాయంతో ఏమాత్రమూ ఏకీభవించలేక పోతున్నాడు రమణ. ఎంత అందమైన బంధం—అది ఒకవేళ బంధమే అయినా అనుకున్నాడు.

"రేపు ఆ సంబంధం చూసి, ఇంచుమించుగా ఏదో లాంఛ నంగా చూడటమే అనుకోండి. మాఅక్కయ్యావాళ్ళ ఎన్నికమీద నాకు చాలా నమ్మకము, గురీ, విశ్వాసమూకూడా వున్నాయి. రేపు సాయం కాలం బెంగుళూరు ఎక్స్‌ప్రెస్‌కు వెళ్ళిపోతాను. సాయంకాలం బ్రాడీ పేట నాలుగోలైను ఎంట్రన్స్ దగ్గరకు రాండి. కాస్త అలా బజారు తిరిగి కబుర్లు చెప్పుకుందాము" అన్నా డతడు. రమణ సంతోషంగా తల ఊపాడు.

"ఇంతకూ మీ పేరేమిటో చెప్పారుగాదు" అన్నాడతడు. రమణ చెప్పాడు.

అతడుకూడా తనపేరు చెప్పుకున్నాడు. వెంకటరావు అని.

రమణకు సంతోషంగా వుంది.

వెంకటరావు చెప్పాడు. "ఏమిటోనండీ. పెళ్ళనేది తప్పదు కాని, ఎంత ఆలస్యమైతే అంత మంచిది" అని నవ్వాడు.

రమణ నవ్వలేదు.

"సరి సరి. లేకపోతే మీరు చెప్పండి. రిక్షాలో వస్తాను. మీ అడ్రసు ఆరవ లైనన్నారు కదూ. ఎన్నో క్రాస్‌రోడ్డు? ఏమిటో కనుక్కోగలను...."

రమణ, "అవసరంలేదు. నేనే వస్తా"నని మర్యాదగా చెప్పాడు.

"ఇంతకూ రేపు నేనుకూడా ఆరవలైనులోనే కదా పెళ్ళి

సంబంధం చూడటం. ఎవరిల్లు చెపుమా. ఆ....మీకేమన్నా తెలుసా అండి....రామారావుగారని, వాళ్ళింటిపేరు కామవరపో, వేమవరపో... వుండాలి."

రమణకు రైలు కాస్తా పెద్దగోతిలో పడిపోతున్న ట్లనిపించింది. ఎంత అణచుకుందా మనుకున్నా అణగకుండా క్రోధమూ, అసూయా, దుఃఖమూ పెల్లుబికి వస్తున్నాయి. అయ్యో అయ్యో అని మనసులో ఎంతగానో ఆక్రోశించాడు. వెంకటరావు ఇతడి ముఖం వేపు చూడకుండా తనలో తానే ఆలోచించుకుంటున్నట్లు "వాళ్ళ సాంప్రదాయం చాలా మంచిదట. తెలిసినవాళ్ళందరూకూడా 'అవశ్యం చేసికోదగ్గ సంబంధ'మనే చెపుతున్నారు."

రమణ ఏమీ మాట్లాడలేకపోయాడు.

"ఏమంటారండీ మీరు? బహుశా మీకుకూడా తెలిసేవుండాలి. ఆయన లాయరు కాబట్టి చాలామందికి తెలిసేవుంటారు."

రమణ తనను తాను సంబాళించుకుని బలవంతాన నవ్వు తెచ్చుకుని "చాలా మంచివాళ్ళు...." అన్నాడు.

వెంకటరావు పొంగిపోతూ

"మీకు వాళ్ళతో పరిచయం వుందా ఏమిటి? ఎప్పుడైనా వాళ్ళింటికికూడా వెళ్ళారా...." అని ఉత్సాహంగా అడిగాడు.

"తెలుసు" అని మాత్రమే ముక్తసరిగా, ముభావంగా సమాధానం చెప్పాడు రమణ.

"వాళ్ళమ్మాయినికూడా చూశారా...." ఉత్కంఠా, కొంచెం సిగ్గూ ధ్వనించే కంఠంతో వెంకటరావు అడుగుతున్నాడు.

తలలో పెట్టుకున్న పువ్వు దుమ్ములో పడిపోతున్న ట్లనిపిస్తున్నది రమణకు. ఏడుపు వచ్చేలా వుంది. ఎవరిమీదనో కసీ కోపం. వాటివాటి స్థానాలు మార్చుకొని కార్పణ్యం, అసహ్యంగా మారిపోతున్నాయి భావాలు. వల్లిమీద అసహ్యం కలుగుతున్నది. అలాంటి వల్లిని తాను చేసుకున్నా తనకు సుఖంలేదు. భగవంతుడి దయ ఉండబట్టే యిది యిలా జరుగుతున్నది. వల్లి పూర్తిగా మారిపోయింది

కాబోలు. ఇంకా నయం. దేవుడి దయవలన తాను నిన్ననో, లేక రేపో బయలుదేరి గుంటూరు వెళ్ళలేదు. తాను ఎంత అవమానం పాలయ్యేవాడు! ఎంత పరిహాసపాత్రు డయ్యేవాడో. తనను చూపి అందరూ ఎంత కంటగించుకునేవాళ్ళో! వల్లి తనతో ఏమనేదో! భగవంతుడికి మనస్సులోనే కోటిదండా లర్పించుకున్నాడు రమణ. ఇది విచిత్రమైన సన్నివేశమే. ఇవాళే యీ వెంకటరావుగారు తనకు తటస్థపడటం. దేవుడు తనను రక్షించాడు. ఆయన తన మేనమామని తానెందుకు వెంకటరావుతో చెప్పాలి! తనకు సిగ్గుగాదా! అవమానం కాదా! చెప్పకూడదు. తన కసలు మేనమామే లేడనుకుంటాడు. వాళ్ళందరూ ఎట్లా పోతే తనకేం! అయినా ఇందులో అధర్మ మేముంది? వాళ్ళు మాత్రం కానిపని ఏంచేస్తున్నారు? మనుషులంతా డబ్బుకోసం, హోదా కోసం,దర్జాకోసం, సౌఖ్యంకోసం మోజుపడతారు.కక్కుర్తిపడతారు. అదిమానవనైజం. వీటిముందు తక్కినవేవీ కొరగావు. వల్లి ఇంకా ఇంకా సుఖపడుతుంది యీ సంబంధమైతే. చిన్న కారులోనే తిరుగుతుంది. పెద్ద, మూడంతస్తుల భవనంలో కాపురం వుండవచ్చు. కావలసినన్ని నగలు. దాసదాసీజనం. వంటమనిషిని పెట్టుకోవచ్చు. మంచిదే-దిగులుగా, నిస్పృహగా నిట్టూర్చాడు రమణ. ఈ విషయం అమ్మకు తెలిస్తే? ఆమె తనతో పైకి వాక్కుమాటా అనకపోయినా లోపల ఎంత కుంగిపోతుందో, ఎంత ఏడుస్తుందో, పాపం, ఎంత బాధపడుతుందో. మామయ్య డబ్బూ దస్కం చూసికాదు అమ్మ వల్లిని తన కోడలుగా చేసుకోవాలని తాపత్రయపడటం, తపన చెందటం. వల్లి అంటే చిన్నతనంనుంచీ పంచప్రాణాలు పెట్టుకొని బ్రతికింది కనుక. ఏదన్నా కొంచెం వల్లికి వొంట్లో బాగులేదని తెలిస్తే ముందు ఈమె నిలవలేకపోయేది. రమణ కసిగా మామయ్యనూ, అత్తయ్యనూ, వల్లినీ కూడా ముద్దాయిలుగా చేశాడు మనసులోనే. వాళ్ళయెడల మనస్సు విరిగిపోయింది.

"మా అక్కయ్యలు చెప్పారుగా! ఆ అమ్మాయి రూపసి అని." ఈ మాటలు రమణకు సహ్యంగా లేవు.

రమణకు మనస్సులో వల్లి యెడల చాలా కోపం వచ్చింది. కాని హృదయం కరిగి నీరై పోతున్నది. తాను ఇప్పుడు ఎక్కడకు పోయేట్లు? ఎక్కడ తల దాచుకునేట్లు?!

"నిజమే....చాలా అందమైన పిల్ల...."

వెంకటరావు పొంగిపోతూనే కొంచెం అసూయగా చూశాడు.

రమణ దేన్నీ పట్టించుకోవటంలేదు.

"తప్పకుండా సాయంకాలం కలవండి. నాకీ వూళ్ళో ఎవరూ తెలీదు. కాలక్షేపంకూడా కాదు. ఒంటరిగా ఎవరికిమాత్రం తోస్తుంది!"

రమణ అచేతనంగానే తన సమ్మతిని తెలియజేశాడు. రైలు వచ్చి స్టేషనులో ఆగింది. పాపను ఎత్తుకొని ఎదుటి బెర్తుమీద కూచున్న యువతి భద్రంగా దిగిపోయింది. ఆవిడ సూట్ కేసును రమణే 'విండో'లోంచి అందించాడు.

ప్లాట్ ఫారంమీద రమణకూడా దిగాడు. 'వెళ్దాం రాండి' అని దారితీశాడు వెంకటరావు. రమణకు తప్పలేదు. ప్లాట్ ఫారం దాటి బయటకు వచ్చిన తరువాత వెంకటరావు మరీమరీ ప్రాధేయపడి తాను ఐదు గంటలనుంచీ వెయిట్ చేస్తూ వుంటానని చెప్పి, తప్పక కలవమని కోరి వెళ్ళిపోయాడు.

రమణకు పుట్టెడు దుఃఖం ముంచుకొనివచ్చింది. తాను వొంటరివాడు. మొదటినుంచీ తాను వొంటరివాడనన్న భావమే మిగిలిపోయింది చివరకు.

ఎండ నెత్తి మాడ్చేస్తున్నది.

జీవితమంతా దుర్భరమైపోయేలా వుంది. ప్రాణప్రదంగా కాపాడుకుంటూ వచ్చిన వస్తువును దొంగలెత్తుకుని పోతున్నట్లుగా వుంది. తాను ప్రతిఘటించలేడు. ఇది మరీ బాధ. కళ్ళముందే కలకాస్తా చెదరిపోయి దుస్వప్నం మొదలైంది.

ఇవాళ తాను యీ ప్రయాణం ఎందుకు చేసినట్లు? తాను మామయ్యా వాళ్ళింటికి వెళ్ళదుగాక వెళ్ళడు. వెళ్ళి చేసేదేముంది? వెళ్ళి, వాళ్ళు తన ముఖంమీదనే వెకిలిముఖాలేసుకుని నవ్వుతూంటే

ఎలా భరించటం? మరి ఇప్పుడు ఎక్కడకు పోతాడు? మళ్ళీ తిరిగి ఇంటి కసలు పోలేదు. మళ్ళీ స్టేషన్‌లోకి వచ్చి బుకింగ్ విండో యెదురుగా బెంచీమీద కూలబడ్డాడు రమణ. తాను వొట్టి తెలివి తక్కువవాడు. భయస్థుడు. దేనికీ పనికిరానివాడు. నిజానికి వల్లిని పొందటానికి తాను అనర్హుడు. వల్లికీ తనకూ ఎంతో అంతరముంది. నిజంగా వల్లి తనను చేసుకునిఉంటే యెంత బాధపడిఉండేదో? రమణ యీ ఆలోచనలకు తట్టుకోలేకపోయాడు. తలకాయ పగిలిపోతున్నది. తనముందు కనపడుతున్న ప్రపంచాన్నంతటినీ విపరీతంగా అస హ్యించుకుంటున్నాడు. అక్కడ కూచోలేకపోయాడు. ఏదో అదృశ్య శక్తి ముందు ముందుకు నెట్టినట్లుగా ఉద్రేకంతో పిచ్చిపట్టినవాడిలాగ పోయి బెజవాడకు టిక్కెట్టు తీసుకున్నాడు, మళ్ళా తాను వచ్చిన రైల్లోనే వేరే పెట్టెలో యెక్కాడు. ఈ రైలు మధ్యదారిలో ఆగిపోయి తానేదైనా ప్రమాదానికి గురైతే బావుండును. తన ఎదురుగా ఎవ రైనా నవ్వుతుంటే తన మనస్సునంతా పిండివేసినట్లు బాధపడ సాగాడు. ఉక్కపోస్తున్నది. తన మనసులోంచి వల్లికి సంబంధించిన ఆలోచనలను తుడిచివేయగలిగితే తన జీవితంలో తాను అంతకన్నా కోరుకొనదగినదేమీ లేదనిపిస్తున్నది. కాని ఆడవాళ్ళంతా వల్లులుగానూ మగవాళ్ళంతా వెంకటరావులుగానూ కనిపిస్తున్నారు. ఎవరిమీదనో కసీ కోపమూ క్షణక్షణానికీ మనసును ఆక్రమించుకుంటున్నాయి.

రైలు కదిలింది. కాని తన హృదయంలోంచి వల్లి కదల లేదు. ఒకసారి నవ్వుతుంది. ఒకసారి కళ్ళ నీళ్ళు పెట్టుకుంటుంది. ఒకసారి అల్లరి కళ్ళతో పెదవులు సున్నాలాగా చేసి వెక్కిరిస్తుంది. ఒకసారి వస్తున్న నవ్వును బలవంతాన ఆపుకొని తర్జనితోబెదిరిస్తుంది. అయినా వల్లి వెంకటరావు దైపోతున్నది.

ఎవరో వచ్చి 'కాస్త అపింట జరగవయ్యా' అన్నాడు. రమ ణకు వాణ్ణి అమాంతంగా గొంతుపిసికి చంపుదా మనిపిస్తున్నది. కాని వాడు దబాయింపు చూపులతో 'జరగవేమిటి?' అని చూస్తున్నాడు. ఏది ఏమైనా మనుషుల్లో బ్రతకవలసిందే. అజ్ఞానులు, దురహంకారులు,

దుర్మార్గులు తటస్థపడినా వాళ్ళలో బ్రతకవలసిందే. మంగళగిరి దాటి పోతున్నా ఆలయశిఖరంవేపు చేతులు జోడించి, మనసులోనైనా దండం పెట్టుకోలేదు. దేవుడియెడల అవజ్ఞ కనపరచా లనిపిస్తున్నది.

నాలుగున్నరకల్లా బెజవాడ చేరాడు. ఎక్కడకూ పోవాలని పించలేదు. కృష్ణ ఒడ్డున చీకటిపడి లైట్లు వెలిగేదాకా తిరిగాడు. అందరూ జీవితాన్ని కొల్లగొడుతూ, సుఖపడుతున్నట్లుగానే వుంది. నీతిగానో, అవినీతిగానో, మోసంచేస్తూనో, క్రూరంగానో, ఒకరి నొకరు వంచించుకుంటూనో ప్రపంచాన్ని తమది చేసుకోవటానికీ, బ్రతుకుమీది మోహాన్ని పెంచుకోవటానికీ ప్రయత్నాలు చేస్తూనే వున్నారు.

ఒక్కసారి రమణకు మనసులో 'చనిపోతే' అనిపించింది. ఆ ఆలోచన రాగానే కాళ్ళు వణికిపోయినయ్. పెదవులు తడి ఆరిపోయి నయ్. తల్లి గుర్తువచ్చి కళ్ళనీళ్ళు తిరిగినయ్. తాను చనిపోలేడు. చనిపోకూడదు.

గవర్నరుపేట సెంటరుదగ్గర సంపెంగపూలు అమ్ముతున్నారు. రంగుల లైట్లు. ఆడవాళ్లు, మగవాళ్లూ—అందరిలోనూ ఉత్సాహం. తీర్థ జనంలాగున్నారు, రంగులరాట్నం ఎక్కి గిరగిరా తిరుగుతూ చప్పట్లు చరుస్తున్నట్లుగా వుంది.

ఎవరో వచ్చి అమాంతంగా తనని కౌగిలించుకుంటే రమణ షాక్ తిన్నవాడిలాగా అయిపోయినాడు. తన నయనేంద్రియం ద్వారా మనసుని ఆజ్ఞాపించి అతడు తన బాల్యమిత్రుడు సుబ్రహ్మణ్యం అని తెలుసుకున్నాడు. సుబ్రహ్మణ్యం, తానూ ఇంటర్‌మీడియట్ కలిసే చదువుకున్నారు. తరువాత విడిపోయారు. సుబ్రహ్మణ్యం బెజవాడలో రైల్వేలో పనిచేస్తున్నాడట.

సుబ్రహ్మణ్యం తమ ఇంటికిరమ్మని రమణను బలవంతం చేశాడు. రమణ చేసేదిలేక అతడితోపాటే వెళ్ళాడు. ఇంటర్ చదివే ప్పుడు వాళ్ళెంతో సన్నిహితంగా వుండేవాళ్ళు. కాలేజీ ముచ్చట్లన్నీ చెప్పుకున్నారు. రమణ మనస్సులో ఆరాటం కొంత తగ్గిన ట్లనిపిం

చింది. మర్రోజు ఉదయం సుబ్రహ్మణ్యం రమణను తనతోపాటే డ్యూటీకి తీసుకునివెళ్ళాడు. రైలుస్టేషనులో ప్రయాణీకులను చూస్తూంటే, కదిలిపోతున్న రైలుబండ్లను చూస్తుంటే వల్లి పదేపదే జ్ఞాపకానికి వచ్చింది. సుబ్రహ్మణ్యం అల్లరికబుర్లు చెపుతున్నాడు. అందరితోపాటు నవ్వుతున్నాడు; నవ్విస్తున్నాడు. అయినా రమణకు మాత్రం ఏమిటో వెలితిగావుంది. తా నీ రెండురోజులూ వల్లి సమక్షంలో గుంటూరులో సరదాగా గడపాలనుకున్నాడు. కాని తన ముఖాన ఇలా రాసిపెట్టివుంది.

అదివారంనాడు సుబ్రహ్మణ్యానికి ఆఫ్. అందుచేత అతడు ఇంట్లోనే వున్నాడు. రమణ బిక్కుబిక్కుమంటూ అతడితో అవాళ కూడా గడిపాడు. సుబ్రహ్మణ్యం బలవంతాన రమణ సినిమాకుకూడా వెళ్ళాడు ఆ సాయంకాలం కాని ఇవేవీ అతడి హృదయాన్ని సాంత్వనపరచలేకపోయినయ్. చల్లపరచలేకపోయినయ్. సోమవారం ఉదయాన్నే తెలతెలవారుతుండగానే సుబ్రహ్మణ్యం వచ్చి రమణను రైలెక్కించాడు.

తనస్థితికి తనకే జాలి కలిగింది రమణకు. గుంటూరులో రైలు అరగంట ఆగినప్పుడు అతడికి కాఫీకూడా తాగా లనిపించలేదు. నిన్న వెంకటరావు వెళ్ళిపోయి ఉంటాడు. తాంబూలాలుకూడా తీసుకొని ఉంటారు. వల్లికి సంతోషంగా ఉండిఉంటుంది; తనభాగ్యాన్ని తలుచుకుంటూ. తొందరగా రైలు బయలుదేరితే బాగుండును. అత డెంత తొందరపడుతున్నాడో అంత ఆలస్యం జరుగుతున్న ట్లనిపిస్తున్నది. వల్లి ఇప్పుడేం చేస్తూవుంటుందో. తల్లి తను వస్తాడని ఎంత ఆత్రుతగా, ఎంత ఆశగా, ఎంత సంతోషంతో ఎదురుచూస్తున్నదో పాపం. తాను జరిగినవిషయం చెపితే ఎంత కుంగిపోతుందో! మనస్సు ఎంత గాయపడిపోతుందో ఆమెకు! తాను ఎలా చెపుతాడు? ఇంత తృణీకారాన్ని - ఇంత తిరస్కారాన్ని - ఇంత అవమానాన్ని, తల్లికి బాధ కలుగకుండా, నొప్పి కలగకుండా, దెబ్బ తగలకుండా ఎలా చెప్ప గలుగుతాడు? రమణకు రైల్లో ఉన్నంతసేపూ తల్లినిగురించే ఆలోచ

నయింది. రైలు కదిలింది. పదకొండు గంటలకు రైలు నరసరావు పేట చేరినప్పుడు రమణకు నేరుగా ఇంటికి పోదామనిపించలేదు. ఇప్పటికే గంట ఆలస్యమైంది. అసలు తాను ఆదివారం రాత్రికే ఇంటికి వద్దామనుకున్నాడు. కాని రాలేకపోయాడు. నేరుగా ఆఫీసుకు వెళ్ళి ఏ ఒంటిగంటకో ఇంటికివెళ్ళి నాలుగుమెతుకులు తినవచ్చు. తల్లి తనకోసం కనిపెట్టుకుని ఉంటుందేమోనన్న బాధకూడా కలగక పోలేదు. కాని వెంటనే ఇంటికి వెళ్ళలేకపోయాడు.

ఆఫీసుకువెళ్ళి ఎవరితోనూ పలక్క తనపని తాను చూసుకో సాగాడు. వీరభద్రం వచ్చి పలకరించినా ముభావంగా, ముక్తసరిగా సమాధానం చెప్పాడు.

ఒంటిగంట కాగానే పర్మిషన్ తీసుకుని దిగులుగా దీనంగా రమణ ఇంటికి వచ్చాడు. ఇవాళకూడా సెలవుపెట్టి గుంటూరులోనే ఉన్నాడని ఆనందంగా ఊహించుకుంటున్న తల్లి సంభ్రమంగా, సంబ రంతో కొడుకునుచూసి నిశ్చేష్టురాలైంది. ఆమెకు ఎంతో దిగులైంది. ఏమీ ప్రశ్నించనూ లేకపోయింది.

కంచంపెట్టి అన్నంపెట్టి రమ్మని పిలిచినతరువాత కంచం ముందు కూచుని అతి సంగ్రహంగా, సంక్షిప్తంగా జరిగిన సంగతి యావత్తూ కొడుకు ఆమెకు చెప్పేశాడు. ఆమె నోట మాట రాలేదు. కొండ విరిగి మీదపడినట్లూ, నడుములు విరిగిపోయినట్లూ అనిపిం చింది. కొడుకు చూడకుండా కళ్ళనీళ్ళు వొత్తుకున్నది. ఇంత అన్యా యం జరిగిపోతున్నా తనకు దిక్కెవ్వరూ లేరుకదా. తాను ఊరు కుంటుందా ఏం? తక్షణమే గుంటూరుపోయి నలుగురి ఎదుటా తమ్ముణ్ణి తల వాచేట్లు చీవాట్లుపెట్టి 'ఎట్లా చేస్తావో చూస్తాగా నీ బిడ్డకు పరాయి సంబంధం' అని పోట్లాట పెట్టుకోదూ? ఇంతలోనే ఆమెకు నిస్పృహ, నిరాశ ఆవరించినయ్. ఏం లాభం? వాళ్లు కుదుర్చు కున్నారేమో. ఈ జన్మకు వాడి పాపిష్ఠిముఖం తాను చూడదు. వల్లికి రేపు కొడుకో కూతురో పుడితే తాను పోయి చూడకుండా, ఎత్తుకో కుండా ఉండగలదా? ఆమె కళ్ళవెంట గిర్రున నీళ్ళు తిరిగినయ్.

రమణ కంచంలో చేయి కడుక్కుంటూఉంటే మూడురోజుల క్రితం తల్లి అన్నమాటలు గుర్తువచ్చినయ్.

బట్టలు వేసుకుని ఆఫీసుకు బయలుదేరాడు.

తల్లి వేపు పరిశీలనగా చూడాలంటే మనస్సంతా భయం భయంగా దిగులుదిగులుగా బితుకుబితుకుమంటూ వుంది. పాపం! ఆమె ఎంత బాధపడుతున్నదో! రమణ వీధివాకిలి దాటబోతూవుంటే తల్లి 'అబ్బాయీ!' అని పిలిచింది.

రమణ దిగులుగానూ, భయంగానూ లోపలకు వచ్చాడు. నులక మంచంమీద తన పక్క చుట్ట కింద భద్రంగా దాచిపెట్టి ఉంచ బడిన కవరు నొకదాన్ని తెచ్చి తల్లి రమణ చేతి కిచ్చింది.

"ఇంతకుముందే వచ్చింది. ఆ సంగతి మరచిపోయాను. ఎవరు రాశారో చూడు. బాబాయినుంచో, లేక తమ్ముడు వ్రాశాడో" అన్నది తల్లి.

రమణకు ఆశ్చర్యంగా వుంది. తనకు కవరు వ్రాసేవాళ్ళు ఎవరూ వుండరు. బాబాయి ఎప్పుడూ కార్డే వ్రాస్తాడు. అయినా నిర్లిప్తతతో కవరు చించి, చక్కని వరుసలో ముత్యాలు కూర్చినట్లుగా వున్న జాబులోని పంక్తులను చూచి ఉద్వేగంతో వణికిపోయాడు. ఆనందమో, విభ్రమమో, సంతోషమో, విచారమో, దుఃఖమో ఏమీ తెలియని స్థితి అది. గుండెలు వేగంగా కొట్టుకొనసాగాయి. శరీర మంతా చెమర్చిపోతున్నది. పారవశ్యమో, ఆశ్చర్యమో, సర్వేంద్రియా లనూ శాసిస్తున్నది. ఆ ఉత్తరాన్ని పదేపదే రమణ ఇట్లా చదువు కున్నాడు :

"బావా,

నువ్వు ఎంత తెలివైనవాడవు! నిన్నేమనాలో తెలీకుండా ఉంది. మేము చాలా మంచివాళ్ళమని ఎప్పుడు కనుక్కున్నావు?

నేను చాలా అందమైనదాన్నటగా. నీ తెలివికి జోహారులు. నిన్ను ఏమనాలో నాకు తోచటంలేదు. నువ్వెప్పుడొస్తావో అని ఎదురు చూస్తున్నాను నేను. నీవేమో భలే పనిచేశావు! తిరుగుప్రయాణంకి మళ్ళీ ఎవరన్నా తటస్థపడితే నాకు పెళ్ళి కాదేమోనన్న బెంగతో కొంచెం రికమెండ్ చేయకపోయావా? చేసే ఉంటావులే! మంచి సంబంధం, వదులుకోవద్దని చెప్పకపోయావా?భలే మంచి బావవే. నాకేం తెలుసు? ఫిరంగిపురంలో మా ఇందిర ఎక్కబట్టీ, అదీ మీ పెట్టెలో ఎక్కబట్టీ నీ తెలివి తెలిసింది. గుంటూర్లో దిగనే లేదుకదూ! నాకు ఒక్కటే విచారంగా వుంది. 'ఇంత అమాయకుడైన బావతో సంసారం ఎట్లా దిద్దుకోగలనా?' అని. ఇందిర చెప్పి నవ్వింది. నిన్నది గుర్తుపట్టింది. అడుగుదామనుకున్నదట కూడా. తనను గుర్తుపట్టలేదా అని. కాని మీరు నా విషయం మాట్లాడుకుంటూ వుంటే విందామని ఏమీ మాట్లాడలేదట. నాకు సిగ్గుగా వుంది బావా! నీకు ఇంకా అనేక విషయాలు వ్రాయటానికి. వచ్చే ఆదివారం అత్తయ్యా, నువ్వూ వస్తారని ఎదురు చూస్తాను. దేవుడి దయవలన మధ్యదారిలో నన్ను చూడటానికి వచ్చేవాళ్ళు ఎవరూ మీకు తటస్థపడకుందురుగాక. శుక్రవారమే ఇందిర వచ్చి చెపితే నీకోసం ఎంతగా ఎదురుచూశానో నీకు తెలీదు. చెప్పినా అర్థం కాదు. ఇంక ఏమి వ్రాయాలన్నా నీమీద నాకు చాలా కోపంగా వుంది. వచ్చి ఆ కోపం పోగొడితేనే ఇక ముందు నీతో మాట్లాడేది.........

చరణసేవకురాలినని వ్రాయనా?

చెవులు మెలిపెడతానని వ్రాయనా?

వల్లి."

———